
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

మంగళవారం 5 మార్చి 2024



బీచ్‌రోడ్డులో పరదాలు!

- సీఎంకు మురుగునీటి కాలువ కనిపించకుండా వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలు ఏర్పాటు
- అధికారుల అత్యుత్సాహం



- వార్త 5వ పేజీలో..

హద్దు దాటిన అటవీ సిబ్బంది

జాతీయ రహదారి నిర్మాణం పేరిట రిజర్వు ఫారెస్టులో భారీ వృక్షాల నరికివేత

- కొయ్యూరు అటవీ సెక్షన్ సిబ్బంది ప్రమేయంపై ఆరోపణలు
- అలైన్‌మెంట్ దాటి చెట్ల కూల్చివేతపై అటవీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- స్క్వాడ్ డీఎఫ్‌వోను విచారణాధికారిగా నియమించిన సీసీఎఫ్
- విచారణ చేపట్టి నివేదిక సిద్ధం చేసిన వైనం



జాతీయ రహదారి నిర్మాణానికి రిజర్వు ఫారెస్టులో కేటాయించిన అలైన్‌మెంట్‌ను (హద్దు) దాటి అటవీశాఖ సిబ్బంది భారీ వృక్షాలను నేలకూల్చారు. ఈ ఘటనపై అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ ప్రారంభమైంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కొయ్యూరు, మార్చి 4: రాజమహేంద్రవరం నుంచి అరకు వెళ్లే జాతీయ రహదారి 516-ఈ నిర్మాణానికి గాను కృష్ణాదేవిపేట- కొయ్యూరు ప్రధాన రహదారి మధ్యలో రావణాపల్లి దాటాక గల చింతాలమ్మఘాట్ రోడ్డు(ఏడొంపుల ఘాట్)లో అవసరమైన అడవి తొలగించేందుకు సంవత్సరం క్రితం కృష్ణాదేవిపేట, కొయ్యూరు అటవీ సెక్షన్‌లకు సంబంధించిన సిబ్బంది ట్రీ ఎన్యూమరేషన్(గణన) చేసి నివేదికలు ఇచ్చారు. ఎన్యూమరేషన్‌లో గుర్తించిన అడవిని తొలగించేందుకు గత అక్టోబరులో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వాటిలో సుమారు రూ.18 లక్షల మేర నిధులు ఖర్చు చేసి నవంబరు నుంచి ఘాట్ రోడ్డులో రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లు తొలగించే చర్యలను కొయ్యూరు అటవీ సెక్షన్ సిబ్బంది చేపట్టారు. అధికారులు ఘాట్‌రోడ్డులో ఏ మేరకు రిజర్వు ఫారెస్టు అవసరమో గుర్తించి ఆ మేరకు అలైన్‌మెంట్ చేశారు. దీనిలో ఉన్న చెట్లు మాత్రమే అటవీ సిబ్బంది గుర్తించి అప్పట్లో నివేదించారు. అయితే పనులు చేపట్టిన అనంతరం అలైన్‌మెంట్‌లో చేసిన ఎన్యూమరేషన్‌ను పక్కన పెట్టి నిబంధనలకు విరుద్ధంగా స్వలాభాపేక్షతో రిజర్వు ఫారెస్టులోని చెట్లు నేలకూల్చారు.

విచారణ ప్రారంభం

ఘాట్ రోడ్డులో కుడివైపున గల అడవి బొయింతి రిజర్వు ఫారెస్టులో బంగారమ్మపేట బీటుకు సంబంధించి 1,355 కంపార్టుమెంట్ కృష్ణాదేవిపేట రేంజ్ పరిధికి చెందుతుంది. ఎడమ వైపు సరుగుడు రిజర్వు ఫారెస్టులో కొయ్యూరు అటవీ సెక్షన్ బంగారమ్మపేట బీటులో 1,267 కంపార్టుమెంట్‌కు చెందుతుంది. వీటిలో బంగారమ్మ బీటులో 59 చెట్లు, సరుగుడు రిజర్వు ఫారెస్టులో 29 చెట్లను అదనంగా నేలకూల్చారు. అయితే చెట్ల తొలగింపునకు అయ్యే ఖర్చుకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన నివేదిక మేరకు డ్రా చేసిన రూ.18 లక్షలకు, జాతీయ రహదారి నిర్మాణానికి వీలుగా ఘాట్‌లో చెట్లు తొలగించి డిపోనకు తరలించిన కలపకు వ్యత్యాసం ఉండడంతో వాటిని కప్పిపుచ్చుకునేందుకు రిజర్వు ఫారెస్టులో చెట్లు తొలగించారని సిబ్బంది అంటున్నారు. అయితే ఈ విషయంలో కొయ్యూరు అటవీ సెక్షన్‌కు సంబంధించిన సిబ్బంది జాతీయ రహదారి నిర్మాణం పేరుతో రిజర్వు ఫారెస్టులో విలువైన చెట్లను నరికించి వాటిని పక్కదారి పట్టించారనే వాదన బలంగా వినిపిస్తున్నది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణకు మూడు జిల్లాలకు చెందిన స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరంను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (సీసీఎఫ్) నియమించారు. దీంతో సోమసుందరం తన సిబ్బందితో శనివారం, ఆదివారం ఘాట్‌రోడ్డు రిజర్వు ఫారెస్టులో తొలగించిన చెట్ల మొదళ్లను గుర్తించి వాటికి సంబంధించిన కలప కాకరపాడు అటవీ డిపోలో ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు. అలాగే జాతీయ రహదారి నిర్మాణానికి వీలుగా కేటాయించిన రిజర్వు ఫారెస్టులో తొలగించిన చెట్లకు అయిన ఖర్చు, వాటికి సంబంధించిన కలప తదితర విషయాలపై పరిశీలన జరిపారు. ఈ విషయమై స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరంను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రతించగా ప్రభుత్వం నుంచి తీసుకున్న నిధులకు సంబంధించి ఖర్చు చూపేందుకు గాను హద్దు దాటారని, తాము రిజర్వు ఫారెస్టులో పరిశీలించిన 29 మొదళ్ల మేరకు కలప డిపోలో ఉందన్నారు. అయినప్పటికీ రిజర్వు ఫారెస్టులో చెట్లు నరికించడం చట్టరీత్యా నేరమని, దీనికి సంబంధించి సీసీఎఫ్‌కు నివేదిక ఇవ్వనున్నట్టుగా ఆయన తెలిపారు.



చింతలమ్మ ఘాట్‌లో విచారణ చేపడుతున్న స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం



రిజర్వు ఫారెస్టులో తొలగించిన చెట్టు మొదలు కొలతలు తీస్తున్న స్క్వాడ్ రేంజర్, సిబ్బంది

సీఎం సమావేశం కోసం అధికారుల తిప్పలు

- నేడు విశాఖలో పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశం

ప్లీజ్... తప్పకుండా రండి!

- విజయవంతం చేసే బాధ్యత అధికార యంత్రాంగానికి అప్పగింత
- సరకు రవాణా రంగంలో ఉన్నవారితో పోర్టు సమావేశం
- రంగంలోకి ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఏపీఐఐసీ
- మరోవైపు కలెక్టరేట్ నుంచి ప్రత్యేకంగా ఒక్కొక్కరికీ మూడేసి సార్లు ఫోన్లు
- సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం
- ఏమి అడగాలో వారికి ముందే సూచన
- వాటికి సమాధానాలు కూడా సిద్ధం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం విశాఖపట్నం పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహిస్తుండడంతో దానిని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ఆపసోపాలు పడుతోంది. ఇటీవల కాలంలో విశాఖలో సీఎం కార్యక్రమాలను సక్సెస్ చేసే బాధ్యతను అధికారులపై పెడుతున్న సంగతి తెలిసిందే. గత నెలాఖరుల శారదా పీఠానికి వచ్చినప్పుడు విమానాశ్రయం నుంచి చినముషిడివాడ వరకు మహిళలను దారిపొడవునా ఎండలో నిల్చోబెట్టి స్వాగతం పలికించిన సంగతి తెలిసిందే.

రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో 'వైజాగ్ విజన్...ఫ్యూచర్ విశాఖ' పేరుతో మంగళవారం నిర్వహిస్తున్న సమావేశానికి పారిశ్రామికవేత్తలను సమీకరించే బాధ్యతను వైసీపీ పెద్దలు...అధికార యంత్రాంగానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం పోర్టు అధికారులు సరకు రవాణా వ్యాపారంలో ఉన్న వారందరినీ సోమవారం రాత్రి నోవాటెల్‌లో సమావేశపరిచి సీఎం సమావేశానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అలాగే ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వంటి సంస్థల నుంచి సభ్యులు అంతా హాజరు కావాలని కోరారు. ఇది కాకుండా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రతి పారిశ్రామికవేత్తకు ఫోన్ చేసి సీఎం సమావేశానికి రావాలని కోరుతున్నారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమానికి ఉదయం 10 గంటలకే హాజరు కావాలని, దీనికి పాస్‌లు కూడా ఇస్తున్నామని చెబుతున్నారు. వస్తున్నారా?, లేదా?...అంటూ కన్‌ఫర్మేషన్ ... మిగతా 6వ పేజీలో

నేడు సీఎం విశాఖ రాక



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్నారు. ఆయన విజయవాడ నుంచి విమానంలో ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు రుషికొండలోని ఐటీ హిల్ నంబర్-3కు వెళతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాడిసన్ బ్లూ హోటల్‌కు 11 గంటలకు చేరుకుంటారు. 'వైజాగ్ విజన్-ఫ్యూచర్ విశాఖ' పేరిట నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొంటారు. 12.35 గంటలకు రాడిసన్ నుంచి బయలుదేరి పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ 'ది కాస్కేడింగ్ సిల్క్స్-భవిత' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రుషికొండ ఐటీ హిల్-3పైకి చేరుకుని హెలీకాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు వెళతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విమానంలో విజయవాడ తిరిగి వెళ్లిపోతారు.



చెరువులవేనం వ్యూపాయింట్‌ను ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభిస్తున్న ఎంపీ మాధవి

లంబసింగిలో వసతుల కల్పనకు చర్యలు

స్వదేశీ దర్శన్ ద్వారా అభివృద్ధి » అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

చింతపల్లి, మార్చి 4: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందని, స్వదేశీ దర్శన్ ద్వారా పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. సోమవారం చెరువులవేనం, లంబసింగి ఘాట్ బోడకొండమ్మ దేవాలయం వద్ద రూ.65.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన వ్యూపాయింట్లు, మరుగుదొడ్లను పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయంగా పేరొందిన లంబసింగి, చెరువులవేనం పర్యాటక ప్రాంతాలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ప్రతి ఏటా శీతాకాల సీజన్‌లో ఈ ప్రాంతాలను లక్షల సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తున్నారన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రూపొందించిన స్వదేశీదర్శన్‌లో లంబసింగిని ఎంపిక చేసిందని చెప్పారు. ఇందులో భాగంగా లంబసింగి, అరకు ప్రాంతాల్లో పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. లంబసింగి ప్రాంతం పర్యాటకంగా ... మిగతా 6వ పేజీలో

నిరుద్యోగుల కలెక్టరేట్ ముట్టడి

గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్



ర్యాలీగా వెళుతున్న గిరిజన నిరుద్యోగులు, నేతలు



కలెక్టరేట్‌లో బైఠాయించిన గిరిజన నిరుద్యోగులు

పాడేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాల్‌దేవ్, డీఎస్సీ సాధన సమితి కన్వీనర్ నరేశ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన నిరుద్యోగులను అన్ని విధాలా మోసం చేస్తుందన్నారు. సాధారణ డీఎస్సీ నోటిఫికేషన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 6,100 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపడితే, అందులో రాష్ట్రంలో గిరిజనులకు 517 పోస్టులు కేటాయిస్తే, అల్లూరి జిల్లాలోని గిరిజనులకు కేవలం 7 పోస్టులు మాత్రమే దక్కుతున్నాయన్నారు. జిల్లాలో వేలాది మంది గిరిజన నిరుద్యోగులు డీఎడ్, బీఎడ్ పూర్తి చేసి ఉన్నారని, ప్రస్తుతం డీఎస్సీ నోటిఫికేషన్‌లో నామమాత్రంగా పోస్టులుండడంతో గిరిజనులు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. శతశాతం గిరిజన అభ్యర్థులకే ఉద్యోగాలు దక్కేలా గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని సురేంద్ర డిమాండ్ చేశారు. తాజా డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ప్రాంతంలో శతశాతం ఉన్న గిరిజనులకు 5 శాతం ఉద్యోగాలు, కేవలం 5 శాతం జనాభా వున్న ఇతరులకు 95 శాతం ఉద్యోగాలు దక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిణామం గిరిజన నిరుద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందన్నారు. ప్రధానంగా జీవో:3 రద్దు కారణంగానే గిరిజనులు ఈ విధమైన అన్యాయానికి గురవుతున్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 9లోగా గిరిజన స్పెషల్ డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేయకుంటే 10న మన్యం బంద్ చేపడతామని ప్రకటించారు.

కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్న నిరుద్యోగులు

కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన సంఘం కార్యాలయం నుంచి సుమారుగా కిలోమీటరున్నర దూరంలో ఉన్న కలెక్టరేట్‌కు గిరిజన సంఘం, డీఎస్సీ సాధన సమితి ప్రతినిధులు, గిరిజన నిరుద్యోగులు ర్యాలీగా చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శాంతికుమారి ర్యాలీలో పాల్గొని ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. కలెక్టరేట్‌కు చేరుకున్న నిరుద్యోగులు అక్కడ బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఈసందర్భంగా తమ డిమాండ్లపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్‌కు ... మిగతా 6వ పేజీలో

కొనసాగుతున్న చలి తీవ్రత

తగ్గుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు



చింతపల్లిలో మంచు

పాడేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గత మూడు రోజులుగా క్రమంగా తగ్గుతున్నాయి. అయినా పగటి వేళ ఎండ ప్రభావం కొనసాగుతున్నది. జి.మాడుగులలో 11, పాడేరులో 12.6, అరకులోయలో 12.8, హుకుంపేటలో 13.3, పెదబయలులో 13.2, ముంచంగిపుట్టులో 13.8, అనంతగిరిలో 15.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు సోమవారం నమోదయ్యాయి. గత మూడు రోజులుగా ఏజెన్సీలో అనంతగిరి మినహా ప్రాంతాల్లో ఒకటి రెండు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. పాడేరు మినహా పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు ఒక మోస్తరుగా పొగమంచు కురిసినప్పటికీ మధ్యాహ్నం మాత్రం ఎండ ప్రభావం అధికంగానే ఉంది.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. సోమవారం చింతపల్లిలో 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు.

పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్

గణేశ్‌కుమార్ సస్పెన్షన్

- చింతూరులో భారీగా రేషన్ బియ్యం మాయం ఘటనే కారణం
- ఈ వ్యవహారంపై విచారణాధికారిగా జేసీ నియామకం

పాడేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.గణేశ్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. జిల్లాలోని చింతూరులో పౌరసరఫరాల శాఖకు చెందిన గోదాములోని రేషన్ బియ్యం భారీగా మాయమైన ఘటనలో ఆయనను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ్‌ను విచారణాధికారిగా నియమించారు. చింతూరులోని పౌర సరఫరాల శాఖ గోదాములో గత కొన్నాళ్లుగా రేషన్ బియ్యం మాయమవుతున్నాయని పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళనలు చేపట్టడంతో పాటు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో గత నెలలో చింతూరు వెళ్లిన అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ రహస్యంగా పౌరసరఫరాల శాఖకు చెందిన గోదాములోని రికార్డులు, బియ్యం నిల్వలను పరిశీలించారు. దీంతో అక్కడ భారీ మొత్తంలో రేషన్ బియ్యం మాయమైనట్టు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గణేశ్‌కుమార్ పర్యవేక్షణ లేమి కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని భావించిన ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. ప్రస్తుతం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారిగా ఉన్న శ్యామ్‌ప్రసాద్‌కు జిల్లా మేనేజర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జేసీ విచారణ అనంతరం ప్రభుత్వానికి ఇచ్చే నివేదిక ఆధారంగా మరికొంత మందిపై వేటు పడే అవకాశాలున్నాయి.

ప్రేమ జంటది ఆత్మహత్యే

- ఇద్దరూ మైనర్లే...
- స్వస్థలం రాజమహేంద్రవరం దరి హుకుంపేట

అరకులోయ, మార్చి 4: అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలోని కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఆదివారం ఉరి వేసుకుని మృతి చెందిన ప్రేమ జంటది ఆత్మహత్యగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి అరకులోయ ఎస్ఐ సంతోశ్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని హుకుంపేట గ్రామంలో నివాసం ఉంటున్న చప్పా చైతన్య (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన జ్యోత్స్న (14) హైస్కూల్‌లో చదువుతున్నది. వీరిద్దరూ గత నెల 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చారు. తరువాత ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు ఆ ప్రాంతంలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలోని కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఇద్దరూ ఉరి వేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేయగా వారిద్దరూ రాజమండ్రి ప్రాంతానికి చెందిన చైతన్య, జోత్స్నగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సోమవారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

చైతన్య, జోత్స్న మృతి విషయం తెలియగానే ఇక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చైతన్య ప్రేమలో ఉన్నట్టు తెలియదని మృతుడు చైతన్య తండ్రి చప్పా శ్రీను లబోదిబోమని విలపించాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నామని, చైతన్య ఇంటర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ కావడంతో పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్నాడని, రెండు రోజుల్లో పరీక్ష రాయాల్సి ఉందని, ఈసారి తప్పకుండా పాసవుతానని చెప్పాడని, ఈ క్రమంలో ఇంత అఘాయిత్యానికి పాల్పడతాడని ఊహించలేదని ఆయన వాపోయాడు. కాగా, మృతురాలు జోత్స్న బంధువులు మాట్లాడుతూ స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఊరంతా వెతికామని, ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంతలో విషాద వార్త వినడాన్ని తట్టుకోలేకపోతున్నామని వాపోయారు. వారి మనసులో ఉన్న ప్రేమబంధాన్ని తమకు చెప్పినా బాగుండేదని రోదించారు.



చైతన్య (ఫైల్ ఫొటో)



జోత్స్న (ఫైల్ ఫొటో)

క్రైం... crime news

రైలు ఢీకొని కౌలు రైతు మృతి

ఎలమంచిలి, మార్చి 4 : ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో జంప పాలెం అండర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొన్న ప్రమాదంలో జంప పాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు వెలగా దాసు(71)మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. జంపపాలెం గ్రామానికి చెందిన వెలగా దాసు గ్రామంలో కౌలుకు పొలం తీసుకుని జీవనాధారం సాగిస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం తన ఇంటి నుంచి పొలానికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణించే గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్టు ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతదేహాన్ని శవ పరీక్ష అనంతరం బంధువులకు అప్పగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాంబిల్లి, మార్చి 4 : మండలంలోని మామిడివాడ కొత్తూరు జంక్షన్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్రి వెంకటలక్ష్మి(32) అనే మహిళ మృతి చెందింది. అచ్యుతాపురం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన కర్రి వెంకటలక్ష్మి, ఆమె భర్త శివ మామిడివాడ సమీపంలో కౌలుకు తీసుకున్న పొలానికి మోపెడ్‌పై వస్తుండగా మామిడివాడ కొత్తూరు జంక్షన్ సమీపానికి వచ్చే సరిగి టిప్పర్‌లారీ వెనుక నుంచి ఢీకొందని స్థానికులు తెలిపారు. వెంకటలక్ష్మి సంఘటనా స్థలంలో మృతి చెందగా.. భర్త శివకు స్వల్పగాయాలయ్యాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మృతురాలు బంధువులు సంఘటనా స్థలంలో కొంతసేపు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న రాంబిల్లి సబ లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో వారు విరమించారు. భర్త శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ లచ్చన్నదొర తెలిపారు.

భవనంపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

బుచ్చెయ్యపేట, మార్చి 4 : మండలంలోని ఓ గ్రామంలో ఇంటి నిర్మాణంలో భాగంగా శ్లాబ్ వేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందకు పడిపోవడంతో వివాహితకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. తైపురం గ్రామానికి చెందిన నక్క సత్యవతి ఇంటికి శ్లాబ్ వేస్తుంది. ఈ పనుల్లో ఉండగా సోమవారం ఒక్కసారిగా కిందకు పడిపోవడంతో ఆమె అపార్మక స్థితికి చేరుకుంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా మారడంతో విశాఖ కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు.

మహిళ మృతదేహం లభ్యం

కశింకోట, మార్చి 4: మండలంలోని వెదురుపర్తి గ్రామానికి వెళ్లే బ్రిడ్జి వద్ద శారదానదిలో మహిళ మృతదేహం సోమవారం రాత్రి లభ్యమైంది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తి వివరాలను ఆరా తీస్తున్నారు. క్లూస్ టీం అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించింది. ఈ మృతదేహం వారం రోజుల కిందట నదిలో కొట్టుకు వచ్చి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మృతదేహమంతా నాచుపట్టి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి పోలీసులు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఎస్.రాయవరం, మార్చి 4: జాతీయ రహదారిపై సోమవారం రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరి డ్రైవర్లకు గాయాలయ్యాయి. కోదాడ నుంచి కశింకోట మండలం బయ్యవరంలోని సిమెంట్ ఫ్యాక్టరీకి క్లింకర లోడ్‌తో వెళుతున్న లారీ గోకులపాడు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కాగా లారీలో ఉన్న క్లింకర్ జాతీయ రహదారిపై పడిపోవడంతో ఒకటిన్నర కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. హైవే పెట్రోలియం పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎస్ఐ విభీషణరావు ఎక్స్‌కవేటర్‌తో క్లింకర్‌ను తొలగింపజేశారు. అలాగే పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన మరో ప్రమాదం జరిగింది. రాజమండ్రి నుంచి శ్రీకాకుళం జిల్లా కొత్తూరు వెళుతున్న మినీ వ్యాన్ ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో ఢీకొంది. దాని వెనుక వస్తున్న కారు మినీ వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్ శివ గాయపడ్డాడు. అతనికి పెనుగొల్లు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. ఈ ప్రమాదాలకు ఎటువంటి కేసులు నమోదు చేయలేదని ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

బీచ్ రోడ్డులో పరదాలు!

- సీఎంకు మురుగునీటి కాలువ కనిపించకుండా వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలు ఏర్పాటు



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సమయంలో అధికారులు ఒక్కొక్కసారి రోడ్డుకు ఇరువైపులా పరదాలు ఏర్పాటుచేస్తుంటారు. ఇప్పటివరకూ ఈ తరహా పరదాలు ఇతరులకు సీఎం కనిపించకుండా, సీఎంకు అవతలివాళ్లు కనిపించకుండా ఏర్పాటుచేస్తూ వచ్చారు. కానీ, మంగళవారం విశాఖ వస్తున్న సీఎంకు ఇక్కడ ఉన్న మురుగునీరు కాలువలు కనిపించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'వైజాగ్ విజన్..ఫ్యూచర్ విశాఖ' పేరుతో రుషికొండలోని రాడిషన్ బ్లూ హోటల్‌లో నిర్వహించే సమావేశానికి సీఎం హాజరవుతున్నారు. అయితే హోటల్ దాటిన తరువాత గిరిజన భవన్‌కు ఆనుకుని మురుగునీటి కాలువ, సూయిజ్ ప్లాంట్ ఉన్నాయి. అవి రెండూ కనిపించకుండా అధికారులు వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలను ఎత్తుగా ఏర్పాటుచేశారు. మురుగునీటి కాలువ కూడా సీఎంకు కనపడకుండా చేయాల్సినంత అవసరం ఏమొచ్చిందని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, మార్చి 4: విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మంగళవారం 'విజన్ విశాఖ' పేరుతో నిర్వహించనున్న సదస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'విజన్ విశాఖ' సదస్సుకు దాదాపు రెండు వేల మంది పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. అన్ని రంగాల్లో విశాఖను అభివృద్ధి చేయాలనేది ఆయన లక్ష్యమన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో రూ.1,500 కోట్లతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారన్నారు. ముడసర్లోవలో జీవీఎంసీకి నూతన భవన నిర్మాణం, కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నగరానికి నీటి సరఫరా, సాగర్‌నగర్ బీచ్ రూ.10 కోట్లతో అభివృద్ధి, వెంకోజీపాలెం నుంచి మేరియట్ హోటల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఎన్నికల ముందు విజన్ గుర్తువచ్చిందా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు..తమ ప్రభుత్వానికి ముందు నుంచి విజన్ వుందని మంత్రి సమాధానం ఇచ్చారు. ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమవుతోందని, అందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అనకాపల్లిలో ఈ నెల ఏడో తేదీన 'వైఎస్ఆర్ చేయూత' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నట్టు మంత్రి చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	264.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ప్రభుత్వ స్థలంలో ఆగని అక్రమ నిర్మాణం!

- నెల రోజుల్లో పూర్తయిన సిటీ క్లబ్ షాపింగ్ కాంప్లెక్స్ భవనం
- అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో రేయింబవళ్లు పనులు



సిటీ క్లబ్ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనం

నర్సీపట్నం, మార్చి 4 : ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినా.. అధికారులు నోటీసులు జారీ చేసినా.. అక్కడ సిటీ క్లబ్ షాపింగ్ కాంపెక్స్ భవన నిర్మాణ పనులు ఆగలేదు. సరికదా.. మెయిన్ రోడ్డు వైపు పరదాల కట్టి మరీ పగలు, రాత్రి అన్న తేడా లేకుండా పనులు త్వరితగతిన చేయించారు. కేవలం నెల రోజుల్లో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి రేపో మాపో ప్రారంభానికి సైతం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం భవనానికి సున్నాలు వేసి, మెయిన్ గేటు అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సిటీ క్లబ్ ఎదురుగా తహసీల్దార్ కార్యాలయం పక్కనే సబ్ కలెక్టర్ కార్యాలయం ఉంది. మెయిన్ రోడ్డులో సుమారు రూ.40-50 కోట్లు విలువ చేసే గ్రామ కంఠం స్థలంలో అనుమతులు లేకుండా కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యుల విషయంలో అయితే అధికారులు ఇలాగే వ్యవహరిస్తారా.. అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అందాయనే ఆరోపణలు వస్తున్నాయి. నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. త్వరలో ఎన్నికలు వస్తున్నాయి.. సిటీ క్లబ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం విషయంలో అధికారులు ఎవరూ తల దూర్చకండి.. తనకు ఇబ్బంది వస్తుందని అని ఎమ్మెల్యే గణేశ్ అధికారుల నోర్లు నొక్కేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎటువంటి డాక్యుమెంట్లు లేవు...!

మునిసిపాలిటీలోని గ్రామ కంఠం సర్వే నెంబరు 357/3లో 55 సెంట్లు విస్తీర్ణంలో నర్సీపట్నం (సిటీ) క్లబ్ ఉంది. పూర్వం గ్రామ పెద్దలు, అధికారులు టెన్నిస్, షటిల్ వంటి ఆటలు ఆడుకోవడానికి రిక్రియేషన్ క్లబ్ కోసం స్థలాన్ని వాడుకునే వారు. దీనికి ప్రభుత్వ పట్టా కాని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కాని లేవని అంటున్నారు. దీంతో డాక్యుమెంట్ పుట్టించడానికి సిటి క్లబ్ కమిటీ ప్రయత్నాలు చేసినట్టు చెప్పుకుంటున్నారు. తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ తీసుకొని దాని ద్వారా రిజిస్ట్రేషన్ చేయిద్దామని ప్లాన్ చేశారని ప్రచారంలో ఉంది. అందులో భాగంగా నర్సీపట్నం తహసీల్దార్‌కు ఎండార్స్ మెంట్‌కి దరఖాస్తు చేసుకున్నారని తెలిసింది. సర్వే నెంబరు 357/3లోని 55 సెంట్లు గ్రామ కంఠం స్థలం, అందులోని భవనం నర్సీపట్నం క్లబ్ అనుభవంలో ఉందని 2022 అక్టోబరు 10 తేదీన తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. ఎల్‌పీసీ సర్టిఫికేట్ ఇవ్వడానికి ముడుపులు అందుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే రిజిస్ట్రేషన్‌కి డాక్యుమెంట్లు తప్పనిసరి అని తెలిసి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారని సమాచారం. ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో మొదట రెండు అంతస్తులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారని, ఇప్పుడు దాన్ని ఆనుకొని మరో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ కంఠం స్థలం యథావిధిగా వాడుకోవడం తప్పితే కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయకూడదు. ఇదిలావుంటే, సిటీ క్లబ్‌లో సబ్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, గ్రామ పెద్దలు టెన్నిస్, చెస్ వంటి ఆటలు ఆడుకునేవారు. కాల క్రమేణా సిటీ క్లబ్ పేకాటకు నిలయంగా మారిందని పలువురు సామాజిక కార్యకర్తలు విమర్శిస్తున్నారు. మద్యం ఏరులై పారుతుందని అంటున్నారు. ఇందులో సభ్యత్వం కావాలంటే రూ.రెండు లక్షలు చెల్లించాలని, సభ్యులకు సకల సౌకర్యాలు ఉంటాయని చెబుతున్నారు. ఇక్కడ ఏం జరుగుతుందో పట్టణంలో అందరికీ తెలిసినా పోలీసులు చూసీ చూడనట్టు పోవడానికి కారణాలు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం : ఆర్డీవో

సిటీ క్లబ్ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సోమవారం విలేకరులతో అన్నారు. ఇందులో భాగంగా మూడు సార్లు నోటీసు ఇచ్చామని వివరించారు. త్వరలో మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

అనకాపల్లి సభ నుంచే ఎన్నికల శంఖారావం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, మార్చి 4: నియోజకవర్గంలోని పిసినికాడ సభ నుంచే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరిస్తారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడో తేదీన పిసినికాడలో సీఎం చేయూత లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించే సభలో పాల్గొంటారన్నారు. ఎన్నికలకు నెల రోజులు సమయం ఉన్నందున ఈ సభను ఎన్నికల ప్రచార సభగా ఉపయోగించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లి అందించిందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మంద పాటి జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

కొత్తూరు : పిసినికాడలో ఈనెల 7వ తేదీన జరగనున్న సీఎం సభా ప్రాంగణాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ.సత్యవతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేయూత లబ్ధిదారులకు నాల్గో విడత నిధులను ముఖ్యమంత్రి విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీపీవో శిరీషారాణి, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్, డీఈఈ ధనుంజయ్, మైన్స్ ఏడీ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం చేయండి

- జేసీ జాహ్నవి



అర్జీదారుని అందించిన వినతిపత్రాన్ని చదువుతున్న జేసీ జాహ్నవి



అర్జీదారునితో మాట్లాడుతున్న ఏఎస్పీ సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 4: స్పందన అర్జీలకు స్పష్టమైన జవాబు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధికారులను ఆదేశించారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జేసీ జాహ్నవిపాటు డీఆర్వో బి.దయానిధి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 293 మంది అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా జేసీ జాహ్నవి మాట్లాడుతూ స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అర్జీలను త్వరగా పరిష్కరించి, అర్జీదారుడు చేసుకున్న ఫిర్యాదుపై ముక్తసరిగా కాకుండా తిరస్కరణపై వివరంగా తెలియజేయాలన్నారు. స్పందనలో వచ్చే అర్జీలు భూసమస్యలు, రేషన్‌కార్డులపై అధికంగా వస్తున్నాయని సంబంధిత అధికారులు వాటి పరిష్కారంలో దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏఎస్పీ క్రైమ్ సత్యనారాయణరావు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ అధికారులు పనిచేయాలని జిల్లా ఏఎస్పీ క్రైమ్ సత్యనారాయణరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం అర్జీదారులతో ముఖాముఖంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సత్యనారాయణరావు మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడూ పరిష్కరించి ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు గురించి నిర్దేత సమయంలో నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందన ముగిసే సరికి 47 అర్జీలు అందగా అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి ఫిర్యాదులు అందాయన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో చోడవరం యువకుడికి కాంస్య పతకం



కాంస్య పతకంతో మణికంఠ

చోడవరం, మార్చి 4 : జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన యువకుడు కాంస్య పతకం సాధించాడు. ఇండియన్ బాడీ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2, 3 తేదీల్లో బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ పోటీలను నిర్వహించారు. చోడవరానికి చెందిన కోన మణికంఠ కాంస్య పతకం దక్కించుకున్నాడు. 75కిలోల వెయిట్ విభాగంలో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇతని తల్లిదండ్రులు కోన ఈశ్వరరావు, కృష్ణవేణి. ఈ సందర్భంగా విజేతను పలువురు ప్రశంసించారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు వడ్డాది విద్యార్థిని ఎంపిక



పతకాలతో హైత్రిక

బుచ్చెయ్యపేట, మార్చి 4: అబాకస్ పోటీల్లో మండలంలోని వడ్డాదిలో గల అక్షర స్కూల్ విద్యార్థిని దొండా హైత్రిక అద్భుత ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అనకాపల్లి ఏడీ స్కూల్ ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్టు స్కూల్ కరస్పాండెంట్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 4: నూతనంగా ఏర్పాటు చేసిన మూడు చట్టాలు గురించి ఐదు రోజులుపాటు మొదటి దశ శిక్షణ తరగతులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సోమవారం ప్రారంభించారు. పోలీస్ అతిథిగృహం సమావేశమందిరంలో నూతన చట్టాలు గురించి ఆయన వివరించారు. భారతీయ శిక్షాస్మృతి 1860, నేర విచారణ ప్రక్రియ స్మృతి 1973, భారతీయ సాక్ష్యాధార చట్టం 1872లను భారత ప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు చేసిందన్నారు. వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) అను నూతన చట్టాలను భారత ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ నూతన చట్టాలు జూలై ఒకటి నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో పోలీసులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ చట్టాల పై దఫదఫాలుగా జిల్లా పోలీసులందరికీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సోమవారం జరిగిన శిక్షణలో 12వ ఏడీజే కోర్టు అడిషినల్ పీపీ వి.దేవానందరావు పాల్గొని సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్, డీటీసీ డీఎస్పీ బి. రామవర్మ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లింగరాజుపాలెంలో సినిమా షూటింగ్



లింగరాజుపాలెంలో ఓ ఇంటిలో జరుగుతున్న బచ్చలమల్లి సినిమా షూటింగ్

ఎస్.రాయవరం, మార్చి 4: హాస్య మీవీస్ బ్యానర్‌లో అల్లరి నరేశ్, అమ్రత అయ్యర్ జంటగా సుబ్బు బొద్దా దర్శకత్వంలో రూపొందుతున్న బచ్చలమల్లి షూటింగ్ మండలంలోని లింగరాజుపాలెంలో సోమవారం జరిగింది. గ్రామంలో గల ఓ ఇంటిలో ఈ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను నటీనటులతో దర్శకుడు సుబ్బు చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తున్నారు. గ్రామంలో సినిమా షూటింగ్ జరుగుతుందని తెలియడంతో స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, మార్చి 4 (అనకాపల్లి): ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని అనకాపల్లి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సుజల స్రవంతి, తోటపల్లి వంటి కీలకమైన ప్రాజెక్టులను అశ్రద్ధ చేసిందన్నారు. అనకాపల్లి వంటి ప్రాంతాల్లో ఉన్న తగరం పూడి, చెర్లోపల్లి వంటి 11 గ్రోయిన్లు ఉండగా అవన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదన్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందన లేదని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. వేసవిలో నీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత నిర్లక్ష్యం ఏ ప్రభుత్వం చూపించలేదన్నారు. జనసేన, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి చేతికి పని, ప్రతి ఎకరాకు నీరు అనే మేనిఫెస్టో ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

సూపర్-6 ప్రతి ఇంటికీ తీసుకెళతాం

నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకత్వం బలంగా ఉందని కొణతాల అన్నారు. రెండు పార్టీల బూత్ లెవిల్ కమిటీల సమావేశం త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీడీపీ, జనసేన అధినేతలు ఉమ్మడి ఆధ్వర్యంలో రూపొందించిన సూపర్-6 పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

ప్రైవేటు లేఅవుట్ కోసం ప్రభుత్వ స్థలంలో రహదారి

రెవెన్యూ అధికారులకు టీడీపీ నేతల ఫిర్యాదు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పరవాడ, మార్చి 4 : పరవాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 226లో గల ప్రభుత్వ స్థలంలో లేఅవుట్‌కు వేస్తున్న రోడ్డు పనులను రెవెన్యూ సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు. అనంతరం ఆ ప్రదేశంలో ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇదే సర్వేనంబరులో కొంతమేర గెడ్డవాగు ఉంది. రియల్టర్ తమ లేఅవుట్ కోసం గెడ్డ వాగును పూడ్చివేసి, రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ గణపతిరావు ఆదేశాల మేరకు వీఆర్వో వెంకటేశ్వరరావు తన సిబ్బందితో వెళ్లి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలం లోంచి రహదారి నిర్మించడం చట్టరీత్యా నేరమన్నారు. సర్వే చేయించి రెవెన్యూ హద్దులను గుర్తిస్తామని తెలిపారు. అప్పటి వరకు రహదారి నిర్మాణ పనులు నిలిపివేయాలని రియల్టర్‌ను ఆదేశించారు. దీంతో పనులను నిలిపివేశారు.

13 మద్యం సీసాలు, నాటుసారాతో ఇద్దరి అరెస్టు

పాయకరావుపేట రూరల్, మార్చి 4: మండలంలో రెండు చోట్ల సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి 13 మద్యం బాటిళ్లు, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్ఐ జోగారావు పక్కా సమాచారంతో సోమవారం మండలంలోని కేశవరం వద్ద మాటు వేసి శ్రీరాంపురం గ్రామం నుంచి సంచిలో తీసుకు వస్తున్న 13 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.నర్సాపురం గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. అదే విధంగా మండలంలో రాజవరం గ్రామ శివార్లలో సారాను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పది లీటర్ల సారాతో మరో ఇద్దరు మహిళలు..

కృష్ణాదేవిపేట, మార్చి 4: పది లీటర్ల సారాతో ఇద్దరు మహిళలను వేర్వేరు చోట్ల పట్టుకుని అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన లింగేటి సత్యవతి, ఎలుసూరి నూకాలమ్మలు గొలుగొండ మండలం కొంగసింగి రహదారిలో వేర్వేరు చోట్ల సోమవారం సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక్కొక్కరి వద్ద నుంచి ఐదు లీటర్లు చొప్పున సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.



సంఘుంబంధ గ్రామంలో సూపర్6 పథకాలపై వివరిస్తున్న ఈశ్వరి

సైకో సీఎంను గద్దె దించాలి

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

జి.మాడుగుల, మార్చి 4: సైకో సీఎంను గద్దె దించాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. గెమ్మెలి పంచాయతీ సంఘుంబంధ గ్రామంలో సోమవారం నిర్వహించిన శంఖారావం కార్యక్రమలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ గిరిజన గ్రామం అభివృద్ధి చెందలేదన్నారు. టీడీపీ శంఖారావంతో వైసీపీ నేతల గుండెల్లో రైలు పరిగెడుతున్నదన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటుతో వైసీపీ బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ సూపర్-6 పథకాలపై గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు, నాయకులు కె.కల్యాణం, ఎల్.రామకృష్ణ, పిన్నయ్యదొర, అప్పలరాజు, నితిన్‌కుమార్, రాధాకృష్ణ, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో వాల్మీకి తెగ తొలగింపు కుట్రే

» జనసేన పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంగులయ్య



మాట్లాడుతున్న జనసేన నేత వి.గంగులయ్య

పాడేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వాల్మీకి తెగ పేరును తొలగించడం కుట్రేనని జనసేన పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ఉప కులాల మధ్యచిచ్చు పెట్టాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా చేస్తున్నదన్నారు. గతంలోనూ ఇదే తరహా కుట్ర ప్రక్రియ ప్రభుత్వం చేసిందని, మరోమారు ఇటువంటి చర్యలకు పాల్పడితే గిరిజనుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. గిరిజనులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వైసీపీని ఏజెన్సీ ప్రజలు బహిష్కరించే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో జనసేన క్షేత్ర స్థాయి నుంచి బలంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కిల్లంగి పద్మ, బొంకుల పద్మలత, అశోక్, భీమన్న, భూపాల్, సింహాచలం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ధారకొండలో బర్త్ వెయిటింగ్ హాలు ప్రారంభం



హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పీవో

సీలేరు, మార్చి 4: ధారకొండ పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన బర్త్ వెయింట్ హాలును ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మారుమూల ప్రాంతాల్లో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో మాతాశిశు మరణాలు అధికంగా జరిగేవని, వీటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు మరణాలను అరికట్టడానికి అత్యాధునిక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అలాగే ధారాలమ్మ ఆలయం పునర్నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే పీవో ప్రారంభించారు. ఈవో సాంబశివరావు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామన్న, ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, సర్పంచ్ రాజు, ప్రజాప్రతినిధులు పి.సాంబమూర్తి, బుజ్జి, స్వర్ణలత, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ధారకొండ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పీవో

సీలేరు: ధారకొండ ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో అభిషేక్ తనిఖీ చేశారు. ధారకొండ ప్రాంతంలో సోమవారం పర్యటించిన ఆయన పాఠశాలలోని తొమ్మిది, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఇంగ్లీషు, సాంఘిక శాస్త్రాలను బోధించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్ పరిశీలించి నిత్యావసర వస్తువును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లీజ్... తప్పకుండా రండి!

... 3వ పేజీ తరువాయి

కూడా తీసుకుంటున్నారు. ఇలా ఒక్కో పారిశ్రామికవేత్తకు మూడేసిసార్లు ఫోన్లు చేస్తున్నారు. మరోవైపు ఏపీఐఐసీకి చెందిన అధికారులు కూడా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. సమావేశాన్ని విజయవంతం చేసే బాధ్యతను అధికారుల భుజాలపై వేశారు. పార్టీ నాయకులు పిలిస్తే వచ్చే పరిస్థితి లేకపోవడం వల్లే అధికారులపై ఆధారపడ్డారు. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్, ఆక్వా, సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్, ఆస్పత్రులు, రియల్ ఎస్టేట్...ఇలా అన్ని రంగాలకు చెందిన వారిని ఈ సమావేశానికి తీసుకురావాలని, అక్కడి 'సాగరిక' సమావేశ మందిరాన్ని కిటకిటలాడేలా చేయాలని యత్నిస్తున్నారు. సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించారు. ఏమి అడగాలో వారికి ముందే సూచించారు. వాటికి సమాధానాలు కూడా ముందే సిద్ధం చేసుకున్నారు. సీఎం సమావేశం నేపథ్యంలో తమను ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్లనిస్తారా?, లేదా?...అని రుషికొండ మార్గంలో రెగ్యులర్‌గా వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

» సాంకేతిక లోపంతో నిలిచిపోవడంతో ప్రయాణికుల పాట్లు



మార్గమధ్యంలో నిలిచిన విశాఖ-భద్రాచలం బస్సు

సీలేరు, మార్చి 4: విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు సాంకేతిక లోపంతో సోమవారం ఉదయం లోతుగెడ్డ జంక్షన్- కృష్ణాపురం గ్రామం మధ్య నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు లోతుగెడ్డ జంక్షన్-కృష్ణాపురం గ్రామాల మధ్య నిలిచిపోయింది. సాంకేతిక లోపం వల్ల గంట సేపు కదలలేదు. దీంతో భద్రాచలం వెళ్లాల్సిన ప్రయాణికులను సీలేరు బస్సులో తరలించారు. ఇటీవల విశాఖపట్నం డిపోనకు చెందిన విశాఖ- భద్రాచలం డే సర్వీసులతో పాటు నైట్ సర్వీసులు కూడా సాంకేతిక లోపంతో తరచూ మొరాయిస్తున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ఏసీబీ వలలో వీఆర్వో

» వీఆర్ఏ కూడా.. రైతు నుంచి లంచం తీసుకుంటూ చిక్కిన వైనం

నాతవరం, మార్చి 4: నాతవరం తహసీల్దార్ కార్యాలయంలో ఓ రైతు నుంచి లంచం తీసుకుంటున్న వీఆర్వో, వీఆర్ఏలను ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాతవరం మండలం గుమ్మిడిగొండ గ్రామానికి చెందిన అడిగర్ల వంశీకృష్ణ అనే రైతు తన తండ్రి పేరున ఉన్న రెండు ఎకరాల 16 సెంట్ల భూమికి సంబంధించి మ్యూటేషన్, అడంగల్ కరెక్షన్‌కు గుమ్మిడిగొండ గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో) జుర్రా సింహాచలం, గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ) చేవళ్ల లోవరాజును సంప్రదించాడు. దీంతో రూ.8 వేలు లంచం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ఆ రైతు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఆ రైతు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. వీఆర్వో సింహాచలానికి రూ.6 వేలు, వీఆర్ఏ లోవరాజుకు రూ.2 వేలు ఇచ్చాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాత్రి వరకు తహసీల్దార్ కార్యాలయంలోనే విచారణ జరిపారు. వీఆర్వో వీఆర్ఏలను మంగళవారం విశాఖలోని ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్టు అధికారులు తెలిపారు.

మెజారిటీ కోసం సమష్టిగా పనిచేద్దాం

» టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర



కార్యక్రమంలో సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

అరకులోయ, మార్చి 4: ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయడం ఖాయమని, మెజారిటీ కోసం సమష్టిగా పనిచేద్దామని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పిలుపునిచ్చారు. అరకులోయ వేంకటేశ్వర కల్యాణ మండపం, అనంతగిరి మండల కేంద్రంలోని టూరిజం హిల్ రిసార్టులో సోమవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ దఫా రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి కావడం ఖాయమన్నారు. అరకు నియోజకవర్గంలోనూ టీడీపీ గెలుపు తథ్యమని, భారీ మెజార్టీ వచ్చేలా పనిచేద్దామని పేర్కొన్నారు. ప్రధానంగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్-6 పథకాలను ప్రతీ ఇంటికీ వెళ్లి వివరించాలని కోరారు. అనంతగిరిలో జరిగిన సమావేశంలో పార్టీ అధ్యక్షుడు బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు, పెదకోట మాజీ సర్పంచ్ దేవుడు, జడ్పీటీసీ మాజీ సభ్యులు గురువులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జోగులు, మహిళా నాయకులు నిర్మల, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే అరకులోయ మండల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, పెదలబుడు, చినలబుడు, మాదల సర్పంచులు పి.దాసుబాబు, ఉపేంద్ర, శ్రీనివాసురావు, పార్టీ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులు విజయనిర్మల, జి.సుబ్బారావు, బొరిబొరి లక్ష్మీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటరమణ మాస్టర్ సేవలు స్ఫూర్తిదాయకం

పదవీ విరమణ అభినందన సభలో వక్తలు

16 కిలోమీటర్ల ఊరేగించిన విద్యార్థులు



వెంకటరమణ మాస్టర్ దంపతుల కాళ్లు కడుగుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాడేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట మండలం సుంద్రుపుట్టు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కుడుముల వెంకటరమణ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక మోదకొండమ్మ ఓపెన్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన సేవలను మాజీ మంత్రి పి.బాలరాజు, ఎమ్మెల్యే కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు కొనియాడారు. ఆయన ప్రత్యేక బోధనను గుర్తించిన గిరిజన సంక్షేమ విద్యా శాఖ పాడేరులో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అనేకమార్లు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డులు పొందిన వెంకటరమణ గిరిజన విద్యాభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

16 కిలోమీటర్లు ఊరేగించిన విద్యార్థులు

ఉద్యోగ విరమణ చేసిన వెంకటరమణ మాస్టర్‌ను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హుకుంపేట మండలం సుంద్రుపుట్టు నుంచి పాడేరు వరకు 16 కిలోమీటర్లు ఊరేగించారు. అలాగే తొలుతగా విద్యార్థుల తల్లిదండ్రులు వెంకటరమణ, సత్యవతి దంపతుల కాళ్లను కడిగారు. తర్వాత థింసా నృత్యాలు, డప్పువాయిద్యాలతో వారిని పాడేరుకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు అభినందన సభ వైభవంగా జరిగింది. గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కె.కాంతారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురం పాఠశాలను సందర్శించిన ఎస్‌సీఈఆర్‌టీఐ బృందం



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీఐ బృంద సభ్యులు

పాడేరు రూరల్, మార్చి 4: జిల్లా కేంద్రం పాడేరులోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సోమవారం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టిఐబి-ఇంటర్నేషనల్ బాకలోరియెట్) బృందం సభ్యులు సందర్శించారు. బృందానికి చెందిన ప్రొఫెసర్ కేశిరాజు శ్రీనివాస్, సీనియర్ కరిక్యులం డిజైన్ మేనేజర్ ఐబీ.మిస్టర్. ఆల్డో, అసోషియేట్ మేనేజర్ అసెస్మెంట్ ఆపరేషన్స్ ఐ.బీ. మిస్టర్.మైఖేల్ తదితరులు ముందుగా ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనపై నిర్వహించే రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు చేరుకుని విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కూర్చొని బోధనాభ్యాసన విధానాన్ని పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం మంజుల, ఆంగ్ల ఉపాధ్యాయిని కృష్ణవేణితో బోధనా విధానాల గురించి చర్చించారు. డీఈవో పి.బ్రహ్మాజీరావుతో విద్యా ప్రణాళిక, బోధనాభ్యాస విధానాలు, ఉపాధ్యాయ శిక్షణలు తదితర అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో సీఎంవో ఎంజి.ప్రకాష్, ఏఎస్‌వో జి.సింహాచలం, ఎంఈవో-2 సరస్వతీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

పెదబయలు, మార్చి 4: మండలంలోని చుట్టుమెట్ట మలుపు వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిసా రాష్ట్రానికి చెందిన మహిళ తీవ్రంగా గాయపడింది. ఒడిసాలోని సరపతి గ్రామానికి చెందిన కిల్లో జోగా, కిల్లో రాజేశ్వరి చింతపల్లి మండలంలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి వెళ్లారు. సోమవారం తిరిగి వస్తూ చుట్టుమెట్ట మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా కొట్టారు. దీంతో వాహనం వెనుక కూర్చున్న రాజేశ్వరి కింద పడిపోయి తీవ్రంగా గాయపడింది. రాజేశ్వరిని 108 వాహనంలో పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్చారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి...

పెదబయలు: సీతగుంట పంచాయతీ కేంద్రంలోని గడ్డికాలనీ సమీపంలో సోమవారం బైక్ ఢీకొని వృద్ధుడు గాయపడ్డాడు. అరకులోయ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గురుకుల కళాశాల నుంచి మండల కేంద్రానికి వస్తున్న క్రమంలో సీతగుంట పంచామతీ రోగుల పేట గ్రామానికి చెందిన బి.సింహాద్రి (60)ని అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో స్థానికులు సమీపంలో ఉన్న పీహెచ్‌సీలో చేర్పడంతో వైద్యులు నిఖిల్, సత్యశ్రీ క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జాముగుడలో విద్యార్థిని మృతి

డుంబ్రిగుడ, మార్చి 4: జాముగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి చెందింది. అరకులోయ మండలంలోని సిరగం పంచాయతీ వర్ర తోకలవలస గ్రామానికి చెందిన జన్ని మేరి ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుంది. విద్యార్థిని అనారోగ్యంతో ఉన్నట్టు ప్రధానోపాధ్యాయిని ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో గత నెల 24న పాఠశాలకు వెళ్లి తన కుమార్తెను తల్లిదండ్రులు తీసుకువచ్చారు. ఆదివారం ఉదయం తాము చర్చి నుంచి వచ్చేసరికి ఇంటి వద్ద తన కుమార్తె చనిపోయి ఉందని విలపించారు. తన కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న పాఠశాల నిర్వాహకులు కనీసం పట్టించుకోలేదని, అంత్యక్రియలకు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం సుజాతను వివరణ కోరగా ఆమె అందుబాటులో లేరు. ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావును వివరణ కోరగా విజయవాడలో సమావేశానికి హాజరయ్యానని, విద్యార్థిని మృతి చెందిన విషయం పాఠశాల సిబ్బంది చెప్పారని ఆయన తెలిపారు.

సాధువుల ముసుగులో హత్యలను ఆపాలి

పాడేరు రూరల్, మార్చి 4: జిల్లాలో సాధువుల ముసుగులో జరుగుతున్న హత్యల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావుదొర కోరారు. ముంచంగిపుట్టు మండలం సంతవీధి గ్రామానికి చెందిన బలరాం హత్య సాధువు కారణంగా మరణించిన రెండో ఘటన అన్నారు. గతంలో పాడేరులోని పీఎంఆర్సీ రోడ్డులో ఒక సాధువు ఆదివాసీ యువకుడిని కత్తితో పొడిచి హతమార్చిన ఘటనను ఆయన గుర్తు చేశారు.

వెలుగు వీవోఏల ధర్నా

పాడేరు రూరల్, మార్చి 4: వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కారం కోరుతూ మంగళవారం ఐటీడీఏ ఎదురుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ప్రకటించారని, అధికారంలోకి వచ్చిన తరువాత మరచారని ఆరోపించారు. చిరుద్యోగులపై నిర్బంధాలు, అక్రమ, హౌస్ అరెస్టులు, సోకాజ్ నోటీసులు వంటివి ఇచ్చి భయభ్రాంతులకు గురిచేశారే తప్ప మాట నిలబెట్టుకోలేకపోయారని మండిపడ్డారు.

విధుల నుంచి సీఆర్‌టీ తొలగింపు



శాంతకుమారి (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, మార్చి 4: కొయ్యూరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో సీఆర్‌టీగా పని చేస్తున్న దుడ్డు శాంతికుమారిని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు గత నెల 27న కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ వివరాలను డీఈవో బ్రహ్మజీరావు సోమవారం తెలియజేశారు. కొయ్యూరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంగ్లీష్ సీఆర్‌టీగా పని చేస్తున్న ఎస్‌వోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గత ఏడాది ఆగస్టులో ఆ పాఠశాలను చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ ప్రతినిధి కె.అప్పారావు సందర్శించారు. పాఠశాలలో వసతులకు మంజూరైన నిధులు దుర్వినియోగం అయ్యాయని, విద్యార్థులతో శాంతికుమారి వెట్టి చాకిరీ చేయిస్తున్నారని కేజీబీవీ ఎస్‌పీడీ(స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్)కి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఎస్‌పీడీ ఆ ఫిర్యాదును సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారికి పంపి సమగ్ర విచారణకు ఆదేశించారు. దీంతో గత అక్టోబరులో పాఠశాలలో విచారణ జరిపారు. విచారణలో గుర్తించిన అంశాలపై ఎస్‌పీడీకి నివేదిక ఇవ్వగా అదే నెలలో శాంతికుమారిని వివరణ అడిగారు. దీనికి సంబంధించిన ఫైల్ ఎస్ఎస్ఏ పీవో కార్యాలయం నుంచి డిసెంబరులో తిరిగి ఎస్‌పీడీ కార్యాలయానికి వచ్చింది. దీనిపై సంతృప్తి చెందని ఎస్‌పీడీ... శాంతికుమారిని ఉద్యోగ బాధ్యతల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జనవరిలో ఆదేశాలు జారీ చేశారు. దీనిపై అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫైల్ పంపగా, ఫిబ్రవరి 27న ఆమెను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు డీఈవో బ్రహ్మజీరావు తెలిపారు.

సీలేరు పీహెచ్‌సీ వైద్యులకు షోకాజ్ నోటీసులు



పీహెచ్‌సీలో బాలింతరాలుకు ఇచ్చిన మందులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

సీలేరు, మార్చి 4: సీలేరు పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి జమాల్ బాషా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీకే వీధి పీహెచ్‌సీ వైద్యాధికారులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, స్థానిరంగా ఉన్నప్పటికీ పీహెచ్‌సీకి రాకుండా రోగులకు కింది స్థాయి సిబ్బందితోనే వైద్యం చేయిస్తున్నారని, ఏమైనా అత్యవసరమైనా ఫోన్‌లోనే సిబ్బందికి చెప్పి చికిత్స చేయిస్తూ పీహెచ్‌సీకి హాజరుకావడం లేదంటూ ధారకొండకు వచ్చిన ఐటీడీఏ పీఓ అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి స్థానిక ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీలేరు పీహెచ్‌సీని తనిఖీ చేసి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను పీవో ఆదేశించారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో విచారణ చేపట్టి సీలేరులో పీహెచ్‌సీ ఇద్దరు వైద్యులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

నిరుద్యోగుల కలెక్టరేట్ ముట్టడి

... 3వ పేజీ తరువాయి

ఆందోళనకారులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, నేతలు బుజ్జిబాబు, ఎం.ఎం.శ్రీను, చిట్టిబాబు, మాతృభాషా వలంటీర్ల సంఘం నేతలు చిట్టిబాబు, కుమారి, శ్రీను, చంద్రయ్య, ఎస్ఎఫ్ఐ నేతలు జీవన్, కార్తిక్, సింహాద్రి, డీఎస్సీ సాధన సమితి కోకన్వీనర్లు ఉపేంద్ర, బొంజిబాబు, అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

లంబసింగిలో వసతుల కల్పనకు చర్యలు

... 3వ పేజీ తరువాయి

అభివృద్ధి చెందితే స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని, ఆర్థిక అభివృద్ధి సాధిస్తారన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ చెరువులవేనాన్ని అందంగా ఉంచేందుకు స్థానిక యువత ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేధించాలన్నారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు అవసరమైన టీ, అల్పాహారం, గిరిజన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఆదివాసీ యువత ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉపాధి పొందవచ్చునన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ లంబసింగిని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదన్నారు. తాజాగా భీమనాపల్లి నుంచి చెరువులవేనం గ్రామం వరకు తారు రోడ్డు నిర్మించేందుకు సుమారు రూ.80 లక్షల నిధులను గిరిజన సంక్షేమశాఖ మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈఈ చాణిక్యరావు, ఏఈఈ రఘునాథరావునాయుడు, వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త విశ్వేశ్వరరాజు, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, డీటీ రాజ్ కుమార్, సర్పంచ్ కొర్ర శాంతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పవర్ కెనాల్ మరమ్మతు పనులు 90 శాతం పూర్తి

సీలేరు, మార్చి 4: డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు 90 శాతం పూర్తయ్యాయని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మిగతా పనులు పూర్తి చేయడానికి గ్రిడ్ అధికారుల నుంచి ఎల్‌సీ అనుమతులు తీసుకున్నామన్నారు. కెనాల్ మరమ్మతు పనులు పూర్తయితే బుధవారం నుంచి నీటిని విడుదల చేసి గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుదుత్పత్తి చేస్తామని ఆయన చెప్పారు. పొల్లూరులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీటిని గోదావరి డెల్టా రబీ పంటలకు విడుదల కొసాగిస్తామని తెలిపారు.

'ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం'

డుంబ్రిగుడ, మార్చి 4: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కిడారి సామాజిక భవనంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అరాచక విధానాలతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోని దుస్థితిలో గ్రామం ఉండడం విచారకరమని వాపోయారు. ప్రభుత్వ అసమర్థ పాలనతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టీడీపీ పొందుపరిచిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, మాజీ ఎంపీపీ దన్నెరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, పార్టీ నేత సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పాడేరు తహసీల్దార్‌గా కల్యాణ్ చక్రవర్తి బాధ్యతలు



పాడేరు రూరల్, మార్చి 4: పాడేరు తహసీల్దార్‌గా టి.కల్యాణ్ చక్రవర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లాలో పని చేస్తున్న ఆయన, ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు తహసీల్దార్ బాధ్యతలను అప్పగించిన అధికారులు, ఇక్కడ పనిచేస్తున్న ఎం.అరుణకుమారిని కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన కల్యాణ్ చక్రవర్తిని ఆర్ఐ కూడా భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్ బజ్జంగి నల్లన్న, వీఆర్వోల సంఘ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

జి.మాడుగుల తహసీల్దార్‌గా గోపాలక్రిష్ణ

జి.మాడుగుల, మార్చి 4: తహసీల్దార్‌గా వీవీ గోపాలక్రిష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై రాగా, ఇక్కడ పనిచేసిన అప్పారావును కలెక్టర్ కార్యాలయానికి ప్రభుత్వం బదిలీ చేసింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి పంపిణీ

కొయ్యూరు, మార్చి 4: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సీడీపీవో విజయకుమారి సోమవారం సామగ్రి పంపిణీ చేశారు. కొయ్యూరు ప్రాజెక్టు పరిధిలోని 24 అంగన్‌వాడీ కేంద్రాలకు మూన్‌చైర్స్, టేబుళ్లు, ఆర్‌వో ప్లాంట్, టీవీలను ప్రభుత్వం సరఫరా చేసినట్టు ఈ సందర్భంగా ఆమె చెప్పారు. వీటిని ఆయా కేంద్రాలకు తీసుకువెళ్లి అమర్చుతున్నామని వివరించారు. ప్రీ స్కూల్ విద్యార్థులకు ఆటపాటలతో విద్యాభ్యాసం చేసేందుకు వీలుగా క్రీడా సామగ్రి సరఫరా చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

గూడెంకొత్తవీధి, మార్చి 4: రైతుభరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శించామని ఏవో మధుసూదనరావు చెప్పారు. స్థానిక ఆర్‌బీకేలో సోమవారం గిరిజన రైతులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. అనంతరం ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతీ ఆర్‌బీకేకో జాబితాలను ప్రదర్శించామన్నారు. అభ్యంతరాలు ఉంటే వ్యవసాయ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

నాటుసారాతో మహిళ అరెస్టు

కొయ్యూరు, మార్చి 4: మండలంలో మూలపేట పంచాయతీ మర్రిపాలెం గ్రామానికి చెందిన కారంగి కన్నయ్యమ్మ నాటుసారాతో పట్టుబడినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలసి దాడులు చేయగా, కన్నయ్యమ్మ తన ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిందన్నారు. ఆమె నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని, నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వివరించారు. ఈ దాడులలో హెచ్‌సీ రమణ, హోంగార్డు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

జి.మాడుగుల, మార్చి 4: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఏటీడబ్ల్యూవో తిరుపాల్ సూచించారు. నుర్మతి బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ అనారోగ్యాలకు గురైనప్పుడు వెంటనే సిబ్బందికి తెలపాలని చెప్పారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా గంగమ్మతల్లికి తొలి పూజ

ముంచంగిపుట్టు, మార్చి 4: సుజనకోట పంచాయతీ కేంద్రంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న గంగమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తొలి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక గుహలో భద్రపరచిన గంగమ్మతల్లి, పోతురాజు విగ్రహాలను బయటకు తీసి శుద్ధి చేశారు. ఆ నీటిని అందరికీ పంచిపెట్టారు. అలాగే విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా ప్రతీ ఇంటికి తీసుకువెళ్లి పూజలు చేశారు. వారం రోజుల పాటు గంగమ్మతల్లిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎస్.శంకరరావు తెలిపారు.